


ఇంతకీ.. వారెక్కడ?



- గడచిన ఐదేళ్ల పాటు అరాచకాలు, దందాలు
- ఎన్నికల్లో ఓటమి తర్వాత.. అంతటా నిస్తేజం
- ప్రజల్లో కానరాని మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు
- పార్టీ శ్రేణులకు కూడా అందుబాటులో లేని వైనం
- అప్పటి తప్పిదాలపై.. వెంటాడుతున్న భయం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో గత ఐదేళ్లు ఆ పార్టీ నాయకులు ఆకాశమే హద్దుగా విర్రవీగారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు.. ఘాటైన విమర్శలతో చెలరేగి పోయారు. అక్రమ కేసులు బనాయిస్తూ.. సైకో నాయకుడి కంటే తామేమీ తక్కువ కాదని రాక్షస ఆనందం పొందారు. నోటిదురుసుతో దుర్భాషలాడుతూ.. సామన్య ప్రజలను సైతం భయబ్రాంతులకు గురిచేశారు. ఆ ప్రతిఫలం ప్రభావం మొన్న ఎన్నికల్లో వైసీపీ నాయకులపై పడింది. ఊహించని రీతిలో వైసీపీని ప్రజలు ఓడించారు. ఎన్డీయే కూటమిని భారీ మెజార్టీతో గెలిపించారు. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా వైసీపీకి రాకుండా.. క్లీన్‌స్వీప్ చేసేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. గత ఐదేళ్ల విర్రవీగిన వైసీపీ నేతలు నిస్తేజంలోకి వెళ్లిపోయారు. వారంతా ఎక్కడున్నారో పార్టీ శ్రేణులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో తమకు కనీస భరోసా ఇచ్చేవారు కూడా కరువయ్యాయరని కేడర్ అయోమయం చెందుతోంది. ఉన్న కేడర్‌ను అయినా కాపాడుకునే ప్రయత్నం చేద్దామన్న తపన.. జిల్లా వైసీపీ నాయకుల్లో కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



● ప్రత్యక్ష రాజకీయాల్లో.. ధర్మాన కొనసాగుతారా?

వైసీపీలో కీలక నేత, మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు.. మొన్న శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘోర పరాభవం పొందారు. ఓ టీడీపీ సర్పంచ్ చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ పాలనలో మంత్రి పదవి లభించినా.. అయిష్టంతోనే ప్రత్యక్ష రాజకీయాలు నిర్వహిస్తున్నట్టు అప్పట్లో ధర్మాన చెప్పేవారు. జగన్ బలవంతంతోనే ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా.. ఘోర ఓటమి చవిచూశాక.. ధర్మాన ఇంతవరకు కార్యకర్తల మనోస్థైర్యం కలిగించేలా పార్టీ కార్యక్రమం ఒక్కటి కూడా చేపట్టలేదు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటారో.. ఉండరో ఆయనకే తెలియని పరిస్థితి. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా చేపట్టిన కార్యక్రమాలు తప్ప.. వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి ఏమీ లేదనే విమర్శలు ఉన్నాయి. పైగా విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయనే ఆరోపణలు మూటగట్టుకున్నారు. ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత పెరగడంతో దారుణ ఓటమిని చవిచూశారు. ఎన్నికల ఫలితాలు తర్వాత కార్యకర్తలు ఆయన వద్దకు వెళ్లడం లేదు. ఆయన కూడా కార్యకర్తలు గురించి ఆలోచించే పరిస్థితి లేదు.



● మాజీ స్పీకర్ వెన్నులో వణుకు...

కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడులను వైసీపీ హయాంలో స్పీకర్‌గా వ్యవహరించిన తమ్మినేని సీతారాం తీవ్రమైన పదజాలంతో విమర్శించేవారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నానన్న విషయాన్ని కూడా ఆయన మరిచిపోయారు. స్పీకర్‌గా ఉన్నప్పుడు ఆమదాలవలస మున్సిపల్ సిబ్బందిని సొంతపనికోసం వినియోగించుకున్నారని.. అలాగే ఇతరత్రా వాటిలో అక్రమాలకు పాల్పడ్డారని ఇప్పుడు కొన్ని అంశాలు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు కేసులు భయంతో తమ్మినేని వెన్నులో వణుకు ఆరంభమైనట్లు తాజా సమాచారం. ఇటీవలే ఆయన ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. కేసులకు భయపడనంటూ పరోక్షంగా ఆయన గురించి ఆయనే వెల్లడించుకున్నారు. ఆ నియోజకవర్గంలో బహు నాయకత్వం కూడా తమ్మినేని కొంపముంచింది. ఇక్కడ వైసీపీని బలోపేతం చేసేలా తమ్మినేని ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు.



● ఎచ్చెర్లలో రౌడీ రాజకీయాలు..

జిల్లాలో రౌడీరాజకీయాలు ఎప్పుడూ లేవు. కానీ, ఎచ్చెర్ల నియోజకవర్గంలో గత ఐదేళ్ల రౌడీయిజం, హత్యారాజకీయాలు కలబోసుకున్నాయి. అవినీతి, అక్రమాలు, రాసలీలలు, హత్యోదంతాలు.. ఇవన్నీ వైసీపీని సర్వనాశనం చేశాయి. మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి నెలకొంది. దీంతో బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు గెలుపు అత్యంత సునాయాసమైంది. ఎన్నికల అనంతరం.. మాజీ ఎమ్మెల్యే కిరణ్ ప్రజల్లోకి వచ్చి.. పార్టీ కార్యక్రమాలు సైతం నిర్వహించలేకపోతున్నారు. కోరిముప్పు తెచ్చుకుని.. అంతర్మథనం చెందుతున్నారు. వైసీపీ కార్యకర్తలకు.. ఇక్కడ నాయకుడు లేని పరిస్థితి నెలకొంది.



● ఎమ్మెల్సీ దువ్వాడ.. పరిస్థితేంటో?

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తర్వాత.. అదేస్థాయిలో టెక్కలి నియోజకవర్గ వైసీపీ నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసులు ఉన్నాయి. జగన్మోహన్‌రెడ్డి అండతో టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టించడంలో దువ్వాడ అత్యంత కీలకంగా వ్యవహరించారు. ఆపై నోటిదురుసుతో చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్, అచ్చెన్నాయుడు వంటి వారిపై బూతు పురాణం లంకించారు. ఫలితంగా... ఎన్నికల్లో దారుణ ఓటమి చవిచూశారు. ఇప్పుడు టెక్కలి నియోజకవర్గంలో తలెత్తుకుని తిరగలేని స్థితిలో ఉన్నారు. ఎక్కడ ఉంటున్నారో.. ఎప్పుడు ప్రజల్లోకి వస్తారో కూడా తెలియని పరిస్థితి. ఆయన వెంట... సాధారణ వైసీపీ కార్యకర్తలు కూడా లేరు. ఆయన వల్ల పార్టీకి లాభం కంటే.. నష్టమే ఎక్కువని ఆ పార్టీ నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. పాతకేసులు ఎప్పుడు ముప్పుతిప్పలు పెడతాయోనని ఓవైపు బెంగ.. మరోవైపు అధికారపార్టీ కన్నెత్తి చూస్తే... తన పరిస్థితి ఏంటో అని భయపడుతూ దువ్వాడ కాలం నెట్టుకొస్తున్నారు.



● పరువు పోగొట్టుకున్న సీదిరి..

డాక్టర్ వృత్తి నుంచి 2019లో వైసీపీలోకి చేరి ఎమ్మెల్యేగా గెలిచి.. ఆపై మంత్రి పదవి చేపట్టిన సీదిరి అప్పలరాజు.. గత ఐదేళ్లలో తన చేష్టలతోనే పరువుపోగొట్టుకున్నారని.. ఆ పార్టీకి శ్రేణులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. కొండల ఆక్రమణపై ఉన్న శ్రద్ధ.. నియోజకవర్గ అభివృద్ధిపై చూపలేదని విమర్శిస్తున్నారు. ఇప్పుడు పదవిపోయినా.. ఎమ్మెల్యేగా గెలవకున్నా.. తెరవెనుక మాత్రం కిరికిరిలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కూటమి అధికారంలోకి రావడంతో.. అక్కడ టీడీపీ కార్యక్రమాలకు అడ్డుకల్పించేలా.. పరోక్షంగా తప్పుడు సలహాలు ఇస్తూ.. తన మనుషులతో కోర్టులను ఆశ్రయించేలా సీదిరి వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఈ కుట్రలు సబబు కాదని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మాజీమంత్రి తీరుతో ఉన్న కొద్దిమంది కూడా వైసీపీని వీడి.. ప్రస్తుత ఎమ్మెల్యే శిరీష వెంట నడుస్తున్నారు.



● శ్రీకాకుళం పార్లమెంట్‌కు వైసీపీ బాధ్యులెవరో...

వైసీపీ అధిష్ఠానం 2014 నుంచీ శ్రీకాకుళం పార్లమెంట్‌కు అభ్యర్థి ఎంపిక విషయంలో తప్పిదాలు చేస్తూనే ఉంది. ముందు ఎన్నికల్లో అసెంబ్లీకి ఓటమి చెందినవారినే.. మళ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ బరిలో దింపి పుట్టిమునిగే పరిస్థితి తెచ్చుకుంది. అప్పట్లో దువ్వాడ శ్రీనివాస్.. ఆ తర్వాత పేరాడ తిలక్‌ను ఇలానే పోటీకి దింపి ఘోర ఓటమి చెందింది. ప్రజల్లో ఆదరణ వ్యక్తులను ఎంపిక చేయకపోవడంతో.. శ్రీకాకుళం పార్లమెంట్ వైసీపీకి అందని ద్రాక్షగా మిగిలింది. ఇప్పుడు పార్లమెంట్ నియోజకవర్గానికి వైసీపీ నుంచి బాధ్యులెవరో ప్రజలకు తెలియదు. పార్టీని పునర్నిర్మించే కార్యక్రమాలు లేవు. పార్లమెంట్ నియోజకవర్గం గురించి ఇక ఆలోచించడమే వృథా అన్నట్టు వైసీపీ నాయకులు ఉన్నారు. ఓటమి నుంచి ఇప్పటికీ వైసీపీ నాయకులు కోలుకోలేకపోతున్నారు. సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల పరిషత్ అధ్యక్షులు సైతం టీడీపీ గూటికి చేరిపోతున్నా.. కనీస నిలువరించే ప్రయత్నం చేయలేకపోతున్నారు.



● రైతులపై నోరుపారేసుకున్న దాసన్న..

వైసీపీ పాలనలో డిప్యూటీ సీఎంగా వ్యవహరించిన ధర్మాన కృష్ణదాస్.. గతంలో రాజధానికి భూములిచ్చిన రైతులపై నోరుపారేసుకునే గౌరవం పోగొట్టుకున్నారు. నరసన్నపేట నియోజకవర్గానికి మాజీ సీఎం జగన్ పలు హామీలిచ్చినా.. అవేవీ నెరవేర్చుకోలేకపోయారు. ఎన్నికల ముందు సొంతపార్టీలో అసమ్మతి బయటపడింది. కుమారుడ్ని రంగంలోకి దింపి.. వారసత్వ రాజకీయాలను నడిపిద్దామనుకున్న దాసన్నకు ప్రజలు కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఎన్నికల తర్వాత మొక్కుబడిగా రెండుసార్లు మాత్రమే కృష్ణదాస్ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం తమకు భరోసా కల్పించేవారు లేరని వైసీపీ కార్యకర్తలు మదనపడుతున్నారు.



● ఇచ్ఛాపురం గురించి చెప్పనక్కర్లేదు..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రజలు ఎప్పుడూ తొంభైశాతం టీడీపీ వైపే ఉన్నారు. ఇక్కడి వైసీపీ అభ్యర్థులను మార్చుచేసినా.. ప్రజలు పట్టించుకోలేదు. టీడీపీ బలాన్ని తగ్గించలేదు. జడ్పీ ఛైర్‌పర్సన్ పదవి లభించాక.. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో శంకుస్థాపనలకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన పిరియా విజయ... వాటిని అమలుచేసే విషయంలో వెనుకబడ్డారు. దీంతో మొన్న ఎన్నికల్లో పరాజయం పొందారు. వైసీపీ కేడర్‌లో కొండంత నిరాశ నెలకొంది. ఇప్పుడు వైసీపీ జెండాను పట్టుకునేవారు ఎవరున్నారో.. ఠక్కున చెప్పలేని పరిస్థితి.



● రెడ్డి శాంతి ఉన్నారో.. లేదో..

జిల్లాలో అవినీతి, అసంతృప్తిలో గత ఐదేళ్లలో పాతపట్నం నియోజకవర్గం ముందువరుసలో నిలిచింది. ఇక్కడి ప్రజలు అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతిని బహిరంగంగానే తప్పుబట్టేవారు. బంధుప్రీతి.. ఆపై సొంతపార్టీ నాయకులను కూడా నమ్మకపోవడం.. నియోజకవర్గంలో ఇసుక, ఇతరత్రా కాంట్రాక్టులపై ఉన్న ప్రేమ.. ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చూపలేదన్న అపవాదు మూటగట్టుకున్నారు. ఫలితంగా టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు చేతిలో ఓటమి చెందారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇప్పుడు నియోజకవర్గంలో ఉన్నారా?.. లేదా ఢిల్లీలో ఉన్నారా అన్నది పార్టీ శ్రేణులకు సైతం తెలియదు.



భళా.. బాలరాజు

ఈయన పేరు బాలరాజు. పాములు పట్టడంలో సిద్ధహస్తుడు. నివాసాల్లో పాము కనిపిస్తే దాన్ని పట్టేసి సురక్షితంగా అడవుల్లో వదిలేస్తుంటాడు. శుక్రవారం కంచిలి మండలం చిన్న శ్రీరాంపురం గ్రామానికి చెందిన బొడ్డ రామకృష్ణ ఇంట్లోకి ఓ నాగుపాము ప్రవేశించింది. ఇది పది అడుగులకుపైన ఉంది. దీన్నిచూసి స్థానికులు భయాందోళన చెందారు. దానిని హడలించినా.. బయటకు రాలేదు. దీంతో స్థానిక స్నేక్ స్నాచర్ బాలరాజును సంప్రదించారు. ఆయన చాకచక్యంగా పామును పట్టుకుని.. అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు.

- కంచిలి

ఎలా ఉన్నారో?

- శ్రీలంక కోస్టుగార్డులకు చిక్కిన ఇద్దరు జిల్లా మత్స్యకారులు
- 40 రోజులుగా బందీ.. ఆందోళనలో కుటుంబ సభ్యులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి, కేంద్రమంత్రికి విజ్ఞప్తి



ప్రభుత్వం చొరవచూపాలి

నా భర్త దాసరి వెంకయ్యను శ్రీలంక జైలు నుంచి విడిపించండి. కుటుంబ పోషణ లేక బాధ పడుతున్నాం. తండ్రి కోసం ఆడపిల్లలు బెంగ పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

- దాసరి లక్ష్మి

(శ్రీకాకుళం రూరల్)

వారిద్దరూ గంగపుత్రులు. ఉపాధి కోసం తమిళనాడు వెళ్లిన.. వారిద్దరూ అక్కడి మత్స్యకారులతో కలిసి సముద్రంలో చేపలవేట సాగిస్తుండగా.. దేశ జలాల సరిహద్దులు దాటేశారు. శ్రీలంక కోస్టు గార్డులకు చిక్కారు. సుమారు 40 రోజులుగా అక్కడ బందీలుగా ఉన్నారు. దీంతో వారి రాకకోసం కుటుంబ సభ్యులు రోజుల తర బడి.. క్షణమొక.. యుగంలా ఎదురుచూస్తున్నారు. శ్రీలంక కోస్టుగార్డుల చెర నుంచి వారికి విముక్తి కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను వేడుకున్నారు. ఇంతలో.. ఆ ఇద్దరి మత్స్యకారుల ఆరోగ్యం క్షీణించిందని ఇటీవల సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు మరింత కలవరపడుతున్నారు.

ఏమైందో..

జూన్ 25న శ్రీలంక కోస్టుగార్డులు తన భర్తను జైల్లో పెట్టారు. 40 రోజులైంది. ఏమైందో అర్థం కావడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయన ఆరోగ్యం క్షీణించిందని ఫోన్ చేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకుని నా భర్తను చెర నుంచి విడిపించాలి.

- గనగళ్ళ అరుణ



● శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్ళవానిపేట పంచాయతీ చినగనగళ్ళవానిపేటకు చెందిన దాసరి వెంకయ్య, గనగళ్ల కొర్లయ్య ఉపాధి నిమిత్తం ఈ ఏడాది జూన్ 7న తమిళనాడు ప్రాంతం నాగపట్నం వెళ్లారు. సముద్రం చేపలవేట సాగిస్తూ జీవిస్తున్నారు. కాగా.. జూన్ 25న వారిద్దరితోపాటు అక్కడి మత్స్యకారులు 8 మంది.. సముద్రంలో చేపలవేట సాగించారు. ఈ క్రమంలో వారి బోటు.. భారత దేశ సముద్ర జలాలు దాటి.. శ్రీలంక సముద్ర సరిహద్దులోకి ప్రవేశించింది. దీంతో శ్రీలంక కోస్టుగార్డులు బోటులో ఉన్న 8మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుని జైల్లో పెట్టారు. 15 రోజుల తర్వాత కర్ణాటకలోని మత్స్యకార యూనియన్ నాయకుల నుంచి కొర్లయ్య, వెంకయ్య కుటుంబసభ్యులకు.. వారు జైల్లో ఉన్నట్టు సమాచారం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చెందారు. కోస్టుగార్డుల చెర నుంచి వారిని విడిపించాలని బాధిత కుటుంబ సభ్యులు అధికారులను వేడుకున్నారు. సర్పంచ్, మత్స్యకా నాయకులతో కలిసి.. పాత కలెక్టర్ శ్రీకేష్ బి. లఠ్కర్‌ను సంప్రదించారు. ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో గత నెల 29న ప్రస్తుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కూడా కలిశారు. శ్రీలంక కోస్టుగార్డుల చెర నుంచి వారిద్దరినీ విడిపించి ఆదుకోవాలని కోరుతూ.. 'మీ కోసం'లో వినతిపత్రాన్ని అందజేశారు. వారి రాక కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.



వెంకయ్య, కొర్లయ్య (ఫైల్)

ఆరోగ్యం క్షీణించింది.. మీరు జాగ్రత్త

శ్రీలంక కోస్టుగార్డుల చెరలో ఉన్న వెంకయ్య, కొర్లయ్య జూలై 29న తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. తమ ఆరోగ్యం బాగోలేదని.. మీరంతా జాగ్రత్తగా ఉండాలని.. పిల్లల్ని బాగా చూసుకోమని చెబుతూనే ఫోన్ కట్ చేశారు. దీంతో వారికి ఏమైందో అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని వారిద్దరినీ విడిపించాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడే దిక్కు..



మా గ్రామానికి చెందిన కొర్లయ్య, వెంకయ్యను శ్రీలంక కోస్టల్ పోలీసుల చెర నుంచి విడిపించాలని అధికారులందరినీ కలిశాం. ఎవరూ స్పందించలేదు. మత్స్యశాఖ అధికారులు కూడా ఆదుకోకపోవడం దారుణం. వారిద్దరి ఆరోగ్యం క్షీణించిందని సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పోషక ఆధారం లేక ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందజేశాం. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ చూపి.. బందీలుగా ఉన్న మత్స్యకారులను విడిపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- బర్రి వాణి, సర్పంచ్, చినగనగళ్లవానిపేట

● ఈ విషయాన్ని మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా 'ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు, తమిళనాడులోని నాగపట్నం అధికారులతో మాట్లాడాం. వీలైనంత తొందరగా బందీగా ఉన్న మత్స్యకారులను జిల్లాకు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నా'మని తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్

కలెక్టరేట్ ఆగస్టు 2: స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'పరేడ్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి. వేదిక ఏర్పాట్లను ఆర్డీవో, ఇంజనీరింగ్ శాఖ, తహసీల్దార్ పర్యవేక్షించాలి. ఆకర్షణీయమైన శకటాలు ప్రదర్శించాలి. ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలి. అవార్డుల కోసం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలి. ప్రతీ శాఖ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులకు మాత్రమే అవకాశం కల్పించాలి. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి. అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల'ని తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు సీహెచ్ రంగయ్య, భరత్‌నాయక్, సుదర్శన దొర, కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, డీఎంహెచ్‌వో మీనాక్షి, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ మహేశ్వర్ రెడ్డి

పీజీ, బీటెక్ రెండో సెమిస్టర్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, ఆగస్టు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల పీజీ, వర్సిటీలోని ఇంజనీరింగ్ విద్యార్థుల రెండో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్. ఉదయభాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. 'ఈ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా నిర్వహిస్తాం. పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 6 నుంచి 12లోగా ఫీజు చెల్లించాలి. ఈ నెల 20 నుంచి పరీక్షలు జరుగుతాయి. ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 8 నుంచి 13లోగా ఫీజు చెల్లించాలి. ఈ నెల 22 నుంచి ఈ పరీక్షలు జరుగుతాయ'ని డీన్ ఉదయభాస్కర్ తెలిపారు.

టీడీపీ అభ్యర్థికి ఓటేస్తారా?

- తాగునీటి పంపు స్విచ్ బోర్డుకు తాళం
- గంగంపేటలో వైసీపీ నేత నిర్వాకం

బూర్జ, ఆగస్టు 2: బూర్జ మండలం గంగంపేటలో వైసీపీ మద్దతుదారుడైన సర్పంచ్ రాజకీయ కక్ష సాధిస్తున్నారని గ్రామస్థులు రోడ్డెక్కారు. తాగునీటి పంపు స్విచ్ బోర్డుకు తాళం వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బాధితుల వివరాల మేరకు.. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో అధిక శాతం మంది గ్రామ పజలు టీడీపీ అభ్యర్థికి మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి.. తాగునీటి బోరు స్విచ్‌బోర్డుకు తాళం వేశారు. రెండురోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ కక్షసాధింపుపై పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. 'మురుగునీటి కాలువల్లో పూడికలను తొలగించకుండా సర్పంచ్ తాత్సారం చేశారు. వీధిలైట్లు వేయకుండా చాలా రోజులు గంగంపేటను చీకటి లో మగ్గేలా చేశారు. పంచాయతీ సెక్రటరీ చొరవతో సమస్య పరిష్కారమైంది' అని తెలిపారు. తాగునీరు అందించేలా చర్య లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



స్విచ్‌బోర్డుకు తాళం తీయాలని కోరుతున్న గంగంపేట వాసులు



170 అడుగుల జాతీయ పతాకం ఆవిష్కరణ

జాతీయ జెండా రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేట ఎంపీపీ పాఠశాలల్లో 170 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు హెచ్‌ఎం సూర్యనారాయణ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. పింగళి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీల సోమేశ్వరరావు, కార్యదర్శి గోపాలకృష్ణ, ఉపాధ్యాయుడు శంకరం పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం

యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఆరేళ్ల మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, నాలుగేళ్ల బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 440 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ:** మేథమెటికల్ సైన్స్ 40, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 20, బయాలజీ 60, అప్లయిడ్ జియాలజీ 18, సైకాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- **ఇంటిగ్రేటెడ్ ఎంఏ:** తెలుగు 19, హిందీ 20, లాంగ్వేజ్ సైన్సెస్ 19, ఉర్దూ 14, ఎకనామిక్స్ 17, హిస్టరీ 35, పొలిటికల్ సైన్స్ 25, సోషియాలజీ 25, ఆంత్రోపాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీలో 28 సీట్లు ఉన్నాయి.
- బీఎస్ ఆనర్స్/రీసెర్చ్: కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంఏలో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు మాత్రం ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. లేదంటే ఓరియంటల్ ఎగ్జామినేషన్(తెలుగు/హిందీ/ఉర్దూ) ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు స్పెషలైజేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు పదోతరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగు చదివుండాలి. బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌నకు కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థులందరికీ ఇంటర్ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 22
- **ఫిజికల్ రిపోర్టింగ్, అడ్మిషన్ కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 30, 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/z94oKavలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484



- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ, ఎంసీఏ

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)-స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఐసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో తొమ్మిది సీట్లు ఉన్నాయి. ఎంసీఏ ప్రోగ్రామ్‌ను కాకినాడలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈకే)లో, ఎంబీఏ ప్రోగ్రామ్‌ను జేఎన్‌టీయూకేకు చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం డిగ్రీ/ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. రెండు ప్రోగ్రామ్‌లకూ ఐసెట్ 2024 అర్హత తప్పనిసరి. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ప్రభుత్వ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్).. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-గిఐగి) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు దశల ఎంపిక విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

896 ఖాళీలు

1. ఐటీ ఆఫీసర్(స్కేల్-1): **170 పోస్టులు**
2. అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): **346**
3. రాజ్‌భాష అధికారి(స్కేల్-1): **25**
4. లా ఆఫీసర్ స్కేల్-1): **125**
5. హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): **25**
6. మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్-1): **205**

అర్హతలు: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్). డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫిషరీ సైన్స్/పిసికల్చర్/అగ్రి.మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్/ఆగ్రో ఫారెస్ట్రీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/ఫుడ్ సైన్స్/అగ్రికల్చర్ టెక్నాలజీ బిజినెస్ మేనేజ్‌మెంట్/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/సెరికల్చర్/ఫిషరీస్ ఇంజనీరింగ్). పీజీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్). పీజీ(హిందీ/సంస్కృతం). డిగ్రీ(ఎల్ఎల్‌బీ), పీజీ డిప్లొమా(పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/లేబర్ లా). ఎంఎంఎస్(మార్కెటింగ్)/ఎంబీఏ(మార్కెటింగ్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/పీజీపీఎం/పీజీడీఎం.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://www.ibps.in/

నవ్య | చిత్రజ్యోతి

చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సర్!

హీరోయిన్ కీర్తిసురేశ్ వివాదంలో చిక్కుకున్నారు. తను నటించిన 'రఘు తాత' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దక్షిణాదిన బెస్ట్ డాన్సర్స్ గురించి ప్రస్తావన తెచ్చిన యాంకర్ 'మీ దృష్టిలో బెస్ట్ డాన్సర్ ఎవరు?' అని కీర్తిని అడిగారు. చిరంజీవి, తమిళ హీరో విజయ్ పేర్లు సూచించి, ఆ ఇద్దరిలో ఎవరి డాన్స్ అంటే మీకిష్టం అని అడిగారు. కీర్తిసురేశ్ విజయ్ పేరును ఎంచుకున్నారు. దీనిపై కీర్తిని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఏ విధంగా చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సరో చెప్పాలని ఆమెను ప్రశ్నిస్తున్నారు. నానీ కన్నా ధనుష్, ధనుష్ కన్నా అల్లు అర్జున్ బాగా డాన్స్ చేస్తారని ఆమె చెప్పారు. అలాగే అల్లు అర్జున్ కన్నా చిరంజీవి డాన్స్‌ను ఎక్కువ ఇష్టపడతాను అని కీర్తి తెలిపారు.





విభిన్నమైన లుక్‌లో విజయ్

'రౌడీ' అంటూ అభిమానులు ఆప్యాయంగా పిలుచుకునే హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 12వ చిత్రం శరవేగంతో తయారవుతోంది. 'మళ్లీ రావా','జెర్సీ' చిత్రాల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాలో విభిన్న గెటప్‌లో కనిపిస్తున్న విజయ్ దేవరకొండ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం ఇటీవల శ్రీలంకలోని అందమైన ప్రదేశాల్లో జరిగిన షూటింగ్‌తో అరవై శాతం చిత్రం పూర్తయింది. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ నెల్లోనే ఆవిష్కరిస్తామనీ, వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.



దేవరతో స్టెప్పులేసిన జాన్వీ

జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'దేవర' చిత్రం కోసం ఇటీవల చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నారు. జాన్వీతో ఎన్టీఆర్ రొమాంటిక్ మోడ్‌లో ఉన్న పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జాన్వీ అందాలు కనువిందు చేస్తున్నాయి. 'పఠాన్', వార్, 'ఫైటర్' చిత్రాలలో వైరల్ స్టెప్స్‌కు పేరు పొందిన బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిన్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించడం విశేషం. ఎన్టీఆర్ అసాధారణమైన స్టెప్స్‌తో ఈ సాంగ్ అందరినీ అలరిస్తుందని దర్శకుడు కొరటాల శివ చెప్పారు. సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'దేవర పార్ట్ 1' ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ చెప్పారు. కల్యాణ్‌రామ్ చిత్ర సమర్పకుడు.

కొత్తగా..

వేణు ఊడుగుల నిర్మాణంలో...
తరుణ్ భాస్కర్ హీరోగా

నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకుడు వేణు ఊడుగుల, బూసం జగన్‌మోహన్‌రెడ్డితో కలసి నిర్మిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం, అక్టోబర్ 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు.



నిర్మాణరంగంలోకి ముత్యాల సుబ్బయ్య



కుటుంబ ఇతివృత్తాలతో అద్భుత చిత్రాలను అందించి, అగ్ర హీరోలందరితోనూ పని చేసిన సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. తన సమర్పణలో తనయుడు ముత్యాల అనంతకిశోర్ నిర్మాతగా ఓ సినిమా నిర్మించనున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓ వైవిధ్య భరితమైన కథాంశంతో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. ఈ నెల 9న అన్నపూర్ణ స్టూడియోలో చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు.



ఇదేం షూటింగ్ కాదు

● హీరో విశాల్‌కు హైకోర్టు మందలింపు


హీరో విశాల్‌ను మద్రాస్ హైకోర్టు మందలించింది. అడిగిన దానికి సరిగ్గా సమాధానం ఇవ్వాలని, ఏదో ఒకటి చెప్పడానికి ఇదేమీ షూటింగ్ కాదంటూ కటువుగా వ్యాఖ్యానించింది. లైకా ప్రొడక్షన్స్ నుంచి హీరో విశాల్ తీసుకున్న రూ.21.29 కోట్ల రుణం కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో కొంతకాలంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ గురువారం న్యాయమూర్తి పీటీ ఆషా సమక్షంలో జరిగింది. ఈ విచారణకు విశాల్ నేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ తరఫు న్యాయవాది కొన్ని పత్రాలు చూపించి, అవి విశాల్ సంతకం చేసినవేనని పేర్కొన్నారు. ఇందుకు విశాల్ సమాధానమిస్తూ.. ఆ ఒప్పందం గురించి తనకేమీ తెలియదని, తన వద్ద కేవలం తెల్లకాగితంపై సంతకం తీసుకున్నారని చెప్పారు. దీంతో ఆగ్రహించిన న్యాయమూర్తి... 'మీరు చేసిన సంతకాన్ని ఎలా కాదని చెబుతారు? చాలా తెలివిగా సమాధానం చెబుతున్నట్టు అనుకోవద్దు. ఇది షూటింగ్ కాదు. జాగ్రత్తగా సమాధానాలు చెప్పండి' అని మందలించారు.



చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డేట్ మారింది

విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుఫాన్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కావాలి. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడిందనీ, ఈ నెల తొమ్మిదిన రిలీజ్ చేస్తున్నామనీ నిర్మాతలు కమల్ బోరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా చెప్పారు. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సిరి సాయిసినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది.





బ్రిట్నీ స్పియర్స్ బయోపిక్

హాలీవుడ్ నటి, పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవిత గాథ త్వరలోనే వెండితెరపైకి రానుంది. నిర్మాణసంస్థ యూనివర్శల్ పిక్చర్స్, బ్రిట్నీ స్పియర్స్ సోషల్ మీడియా ద్వారా శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. 'నాకు ఇష్టమైన చిత్రాలను నిర్మించిన మార్క్ ప్లాట్‌తో ఒక సీక్రెట్ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నాను. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది' అని బ్రిట్నీ పేర్కొన్నారు. బ్రిట్నీ స్వీయ రచన 'ది ఉమెన్ ఇన్ మీ' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. జోన్ ఎం. చూ దర్శకత్వంలో మార్క్ ప్లాట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బ్రిట్నీ బాల్యం నుంచి స్టార్‌గా ఎదిగేవరకూ ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును ఆవిష్కరించనున్నారు.





సొంత భవనాలు లేవు.. సౌకర్యాలు కరువు

- పరాయి పంచన నిర్వహణ
- ఇదీ చిన్నకొజ్జిరియాలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల దుస్థితి



గ్రామ సచివాలయ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ

కంచిలి: చిన్న కొజ్జిరియాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వసతులు వేధిస్తున్నాయి. ప్రధానంగా సొంత భవనాలు లేకపోవడంతో పరాయి పంచనే నిర్వహించాల్సివస్తోంది. దీనికితోడు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి సౌకర్యాలు కూడా వెక్కిరిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ రెండు భవన నిర్మాణాలు పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని చిన్న కొజ్జిరియా ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం లేక సామాజిక భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ సభ్యులతోపాటు గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసిన విషయం విదితమే. గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు కలిసి స్పందన కార్యక్రమంలో రెండుసార్లు ఫిర్యాదు చేశారు. దీంతో పాఠశాల భవన నిర్మాణానికి నాడు-నేడు రెండో ఫేజ్‌లో నిధులు మంజూరు జరిగిందని చెప్పి, స్పందనలో ఫిర్యాదును వెనక్కి తీసుకొనేలా చేశారని, తర్వాత నిధులు మాత్రం విడుదల చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనల నేపథ్యంలో పాత భవనాన్ని గ్రామస్థులే కూల్చివేశారు. అనంతరం పక్కనే ఉన్న సామాజిక భవనంలో ప్రస్తుతం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. చినుకులు పడితే సామాజిక భవనంలోకి నీరుచేరి, విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే ఉపాధ్యాయుడు ఉండగా, గ్రామస్థులంతా కలిసి విద్యావలంటీరును ఏర్పాటు చేసుకున్నారు. 16 మంది రెగ్యులర్ విద్యార్థులతోపాటు పీపీ పద్ధతిలో మరో ఆరుగురు విద్యార్థులు చేరి, మొత్తం 22 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి తరగతులతోపాటు మధ్యాహ్న భోజనం సైతం ఒకే గదిలో నిర్వహిస్తుండడంతో వారంతా తీవ్ర ఇబ్బందిపడుతున్నారు.


సామాజిక భవనంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సచివాలయ భవనంలో...

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం కూడా పరాయిపంచనే నిర్వహిస్తున్నారు. సొంత భవనం లేక గ్రామ సచివాలయం భవనంలో ప్రస్తుతం నెట్టుకొస్తున్నారు. 12 మంది చిన్నారులు ఉన్న ఈ కేంద్రానికి సొంతభవనం లేకపోవడంతో నిర్వహణ చాలా కష్టంగా ఉందని నిర్వాకులు చెబుతున్నారు. 2018-19లో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఎనిమిది లక్షల రూపాయలు నిధులు మంజూరు జరిగింది. పనులు ప్రారంభించి, పునాది స్థాయి వరకు జరిగినప్పటికీ బిల్లులు రాక, పనులు మధ్యలో నిలిచిపోయాయి. చేసిన పనులకే బిల్లులు రాలేదని, అందుకే పనులు నిలిపివేయాల్సి వచ్చిందని కాంట్రాక్టర్ విష్ణుమూర్తి తెలిపారు. అధికారులు, పాలకులు స్పందించి బిల్లులు మంజూరు జరిగేలా చర్యలు తీసుకుని, భవనం నిర్మాణం జరిగేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

చిన్న కొజ్జిరియా ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు పంపించినట్లు ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్ తెలిపారు. నిధులు మంజూరు జరిగిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదక పంపించామని తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయండి

- జీసీ గురుకుల సంక్షేమ పాఠశాల రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి కేబీ రావు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కేబీ రావు

వజ్రపుకొత్తూరు: ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బీసీ గురుకుల సంక్షేమ పాఠశాల రాష్ట్రడిప్యూటీ కార్యదర్శి కేబీ రావు కోరారు. శుక్రవారం అక్కుపల్లి, పలాస గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు.రికార్డులు, వసతి, స్టోర్ గదులును తనఖీచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విద్యాసాగర్, జి.ప్రశాంతి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, కమిటీ ఛైర్మన్ రూపా పాల్గొన్నారు.

పశుగణనకు సిద్ధం కావాలి: ఏడీ


మాట్లాడుతున్న కరుణాకరరావు

పాతపట్నం: పశుగణనకు సిద్ధంకావాలని ప్రాంతీయపశువైద్యశాల ఏడీ మంచు కరుణాకరరావు కోరారు. శుక్రవారం పాతపట్నంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పాతపట్నం,మెళియాపుట్టి మండలాల పశుసంవర్థకశాఖ అధికారులు, సిబ్బందితో 21వ అఖిల భారత పశుగణనపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యులు పి.అనిల్, కె.మౌనిక, బి.శ్రీవాణి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలి

జలుమూరు: గృహ నిర్మాణాలు వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు కోరారు. శుక్రవారం జలుమూరులో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలంలో 252 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రసాదరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా నీలమణి దుర్గకు పూజలు


కూరగాయల అలంకరణలో అమ్మవారు

పాతపట్నం: పాతటప్నంలోని నీలమణి దుర్గకు 500కేజీలు పైబడి కూరగాయలు, పండ్లతో అలంకరించి ఆషాఢ మాస శుక్రవారం పురస్కరించుకునిశాకంబరీదేవిగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఉదయం నుంచే పాతపట్నం, పరిసర గ్రామస్థులు దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మహారుద్రాభిషేకం

టెక్కలి: టెక్కలి పట్టుమహాదేవికోనేరు గట్టుపైగల రామలింగేశ్వరాలయంలో మహారుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రుద్రం, హోమాలు, లలిత సహస్రనామ పారాయణం రోజులో 12గంటలపాటు అర్చకులు తర్లా శివకుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

ఆసుపత్రి ప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు

టెక్కలి: టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రి ప్రాంగణం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం పరిశుభ్రం చేసే పనులు ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్ తదితరులు యంత్రాలతో ప్రాంగణం బయట ముల్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు.ప్రాంగణంలో లైటింగ్ సౌకర్యం, మొక్కలు పెంచడం, రోగులు కూర్చునేందుకు సౌకర్యాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు శేషగిరిరావు తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు

హిరమండలం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని గులుమూరు ఫీడర్‌లో ఉన్న గ్రామాల వద్ద విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. గులుమూరు, కొండరాగోల, శాస్త్రులపేట, దుర్బలాపురం గ్రామాలకు పరిధిలో తీగలకు ఆనించి ఉన్న చెట్టు కొమ్మలను సిబ్బంది తొలగించారు.

ప్రతి విద్యార్థికి ఇంటర్ కీలకం


మాట్లాడుతున్న రుక్మాంగధరరావు

నరసన్నపేట: జీవితంలో స్థిరపడేందుకు ప్రతి విద్యార్థికి ఇంటర్ కీలకమని రిటైర్డ్ ఆర్ఐవో ఎస్.రుక్మాంగధరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో లక్ష్యసాధనకు ఇంటర్ మొదటి సంవత్సరం నుండే చదవాలన్నారు. అనంతరం గతఏడాది ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, మేనేజ్‌మెంట్ సభ్యులు జి.రంగారావు, మత్స్య నిరంజన్ ఏవో వెలమల సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చింతు కృష్ణారావు, వెలమల అసిరినాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన లక్కోజు ఈశ్వరరావు కిడ్నీవ్యాధి బారినపడి మృతి చెందడంతో పలాస నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి చిన్నాచారి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను కలిసి రూ.95 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు విష్ణు ఆచార్యఅర్జునరావు, మధు, అండలూరు కోటి, సూర్యనారాయణ, సాంబమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.


మంత్రి దృష్టికి సమస్యలు

మెళియాపుట్టి: పౌరసరఫరాలశాఖ మంత్రి నాందేడ్ల మనోహర్ దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లినట్లు జనసేన నాయకుడు కంచరాన సాయి తెలిపారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు ఆయన చెప్పారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ లత వెంకయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

దళిత సంఘాల జేఏసీ నిరసన


నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

టెక్కలి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు తాము వ్యతిరేకమని దళిత సంఘాల జేఏసీ అభిప్రాయపడింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి టెక్కలి అంబేడ్కర్ పార్కులో వారు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చల్లా రామారావు, ఆట్ల రాహుల్, చింతాడ శ్రీనివాస్, రామారావు, యడ్ల గోపి, కూరాకుల యాదవ్, బోకర నారాయణ, లింగరాజు పాల్గొన్నారు.

కొత్తపేటలో తాగు నీటిఎద్దడి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేటపాతఊరులో నెల 15 రోజులుగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ తాగునీటి పథకం పాడవడంతో కొళాయిలు ద్వారా నీరు రావడంలేదు. ఈ విషయంపై పలుసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిపథకానికి మరమ్మతులు చేయించి నీటి సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన ఆర్.బాబురావు తదితరులు కోరుతున్నారు.

పలాసలో కేంద్రీయ విద్యాలయం: శిరీష


పలాసలో మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస: పలాసలో వచ్చే ఏడాదికి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో శిరీష పలాసలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. సూదికొండ దిగువన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమయ్యిందని చెప్పారు.రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌పూర్తిచేస్తామని తెలిపారు. జన్‌మన్ పథకం కింద నియోజకవర్గానికి రూ. 3.50 కోట్లు గిరిజనపాఠశాలకు మంజూరయ్యాయని చెప్పారు. పలాస తాగునీటి సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిధులు 50 శాతం పలాసలోనే ఖర్చుచేసేందుకు ప్రణాళికలు వేశామన్నారు. గతంలో ఎంపీ నిధులు ఇస్తే అప్పటి మంత్రి అప్పలరాజు అడ్డుకున్నారని గుర్తుచేశారు. కాగా స్థానిక కిడ్నీ ఆసుపత్రి ప్రాంగణంలో ఆ నలుగురు సేవాసంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

విద్యాభివృద్ధికి పెద్దపీట వేయడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శుక్రవారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు,లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణా రావు, పీరుకట్ల విఠల్‌రావు, టంకాల రవిశంకర్‌గుప్తా, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, నవీన్, జోగమల్లి, కొత్త సత్యం, ఎ.రామకృష్ణ, అధ్యాపకులు కొండల మధుబాబు, ఝాన్సి, వెంకటమోహన్, పి.చిరంజీవులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

పలాస రూరల్: అన్నదాతకు అండగా ఉంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.మండలంలోని బ్రాహ్మణతర్లాలో ఎరువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ పలాస మండలా ధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు,పోలాకి పాపారావు, ఏడీఏ మధు, ఏవో పోలారావు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి: బగ్గు


నియమాకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

నరసన్నపేట: మైనార్టీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ మైనర్టీ అధ్యక్షుడిగా ఎస్కే మదీనా, కార్యదర్శిగా ఎస్కే అన్వర్‌కు నియమాకపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ముస్లిములకు అండగా ఉంటుందని, వారు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం చర్యలుతీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జామియా మసీదుకార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


హరిపురం: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న పీవో వసుందరాదేవి, సిబ్బంది

హిరమండలం: తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు తెలిపారు. శుక్రవారం సుభలయ ఆర్ఆర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక రోజారాణి, ఎంపీటీసీ చింతాడ బుడ్డు పాల్గొన్నారు. ● **హరిపురం:** మందస మండలంలోని హరిపురం సెక్టార్-1లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగాసామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో వసుందరాదేవి, సూపర్‌వైజర్లు మంగమ్మ, రామలక్ష్మి, జయలక్ష్మి, సర్పంచ్ పురుషోత్తం, ఎంపీటీసీ అప్పన్న పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** కొల్లవానిపేటలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల్లో ఐసీడీఎస్ పీవో నాగమణి అవగాహన కల్పించారు. జమ్ము, తామరాపల్లిల్లో తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు. ● **పోలాకి:** చల్లబంద అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా రీసెర్చ్ విభాగాధిపతి, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర విస్తరణాధికారి నల్లిరవికుమార్, సర్పంచ్ తర్రలక్ష్మీనారాయణ, కేంద్ర సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● **జలుమూరు:** మండలంలోని చల్లవానిపేట సెక్టారులో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరువైజర్ సీ తారత్నం,అంగనవాడీ కార్యకర్త కొండమ్మ పాల్గొన్నారు.

యూడైస్‌లో విద్యార్థుల వివరాలు ఉండాలి

నరసన్నపేట: యూడైస్‌లో ప్రతి విద్యార్థి వివరాలు ఉండాలని సర్వశిక్షాభియన్ ఏఎల్ఎస్ కోర్డినేటర్ పి.జనార్దనరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో యూడైస్, డ్రాపౌట్లపై ఎంఈవోలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యాక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు, మండల కోర్డినేటర్ శశిరేఖ పాల్గొన్నారు.

ఎండీఎం కోసం దాతలు ముందుకురావాలి

జలుమూరు (సారవకోట): పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం (ఎండీఎం) అందించడానికి మరింతమంది దాతలు ముందుకురావాలని ఎంఈవో ఎంవీ రమణ తెలిపారు. మండలంలోని చీడిపూడి ప్రాథమిక పాఠశాలలో విశాఖకు చెందిన ఎస్.సత్యనారాయణ శుభదిన కార్యక్రమానికి అందించిన ఆర్థికసాయంతో శుక్రవారం నిర్వహించిన మధ్యాహ్న భోజనంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకరాపల్లిలో ఆయిల్‌పాం ప్లాంటేషన్

సంతబొమ్మాళి: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తామని టెక్కలి ఉద్యానశాఖాధికారి కె.సునీత తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకరాపల్లిలో ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు అందిస్తున్నాయన్నారు.తమ శాఖ ద్వారా 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం సాగులో అంతరపంట వేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జోగారావు, ఉద్యానవన విస్తరణాధికారి శాంతి పాల్గొన్నారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

మందస: పాఠశాలల యాజమాన్యకమిటీ(ఎస్‌ఎంసీ)ఎన్నికలు ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘుపతిరావు తెలిపారు. శుక్రవారం మందసలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

●**నందిగాం:** మండలంలో ఈనెల ఎనిమిదో తేదీన ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావులు స్కూల్‌కాంప్లెక్స్‌లు వారీగా హెచ్‌ఎంలకు సూచనలు చేశారు. ఉదయం తరగతి వారీగాసభ్యుల్ని ఎంపికచేసి మధ్యాహ్నం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికతో పాటు ప్రమాణ స్వీకారం, తొలి సమావేశాలు జరపాలని సూచించారు.

NAME CORRECTION

I, **DUMPALA KALYAN KUMAR**, S/o. Mohan Rao, residing at D.No. 21-1-97/a, Rajamma Colony, Palasa, Udayapuram, Srikakulam. Hereby declare that in my **CBSE- Grade sheet cum Certificate S.No. SSE/2015 - 304596 session 2013-15** my name was entered as **DASARI KALYAN KUMAR** instead of **DUMPALA KALYAN KUMAR.** I request concern authorities to kindly correct my name as **DUMPALA KALYAN KUMAR.** Vide affidavit No. 71AA 331836, dated 19-07-2024 sworn before notary at Visakhapatnam

NAME CORRECTION

I, **DUMPALA KIRAN KUMAR**, S/o. Mohan Rao, residing at D.No. 21-1-97/a, Rajamma Colony, Palasa, Udayapuram, Srikakulam. Hereby declare that in my **CBSE- Grade sheet cum Certificate S.No. SSE/2012 - 366566 session 2010-12** my name was entered as **DASARI KIRAN KUMAR** instead of **DUMPALA KIRAN KUMAR.** I request concern authorities to kindly correct my name as **DUMPALA KIRAN KUMAR.** Vide affidavit No. 71AA 331835, dated 19-07-2024 sworn before notary at Visakhapatnam

238 మందికి కంటి పరీక్షలు

హరిపురం: మందస మండలంలోని రాధాకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం 238మందికి కంటిపరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్యులు రోణంకి వెంకటరమణ పరీక్షలు నిర్వహించి 16మందికి కళ్లజోళ్లకు సిఫారసుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, మమ్మీదేవి, రాజు, ఉత్తరకుమారి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


హిరమండలం: చింతాడ గిరికి నియామకపత్రాన్ని అందజేస్తున్న అధికారులు


వజ్రపుకొత్తూరు: ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న చలపతిరావు

మత్స్యకార సంఘాలకు ఎన్నికలు

జిల్లాలోని అక్కుపల్లిసాగర్ మత్స్యకార సొసైటీ, హిరమండలం మండలంలోని పెద్ద సంకిలికి చెందిన ప్రేమసాయి సుధా మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి.ఈ మేరకు గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు.

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిసాగర్ మత్స్యకార సొసైటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు విజయంసాధించింది. శుక్రవారం అక్కుపల్లి సచివాలయం ఆవరణలో ఎన్నికలు సొసైటీ అధికారి ఆధ్వర్యంలో జరిగాయి. ఈమేరకు టీడీపీ మద్దతుతో పోటీచేసిన కాసచలపతిరావు అధ్యక్షుడిగా, సూరాడ లోకనాథం ఉపాధ్యక్షుడిగా, మడ్డు జేజేరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లగా గుంటి గురునాధం, సింగుపల్లి నరేష్, మడ్డు నారాయణ, కాస మహేష్, సింగుపల్లి ఢిల్లీరావు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు సూరాడ మోహనరావు, సింగుపల్లి బాలకృష్ణ, మోస వర్రప్రసాద్ పాల్గొన్నారు.

హిరమండలం: మండలంలోని పెద్ద సంకిలికి చెందిన ప్రేమసాయి సుధా మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికను హిరమండలంలో శుక్రవారం నిర్వహించారు. శ్రీకాకుళం మత్స్యశాఖ ఏడీ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో సుభలయ ఆర్ఆర్ కాలనీకి చెందిన చింతాడ గిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

టెక్కలి: మొఖలింగాపురం పంచాయతీ పరిధి చిన్నకేదారి, మొఖలింగాపురం పరిధిలో బీఎస్ఎన్ఎల్ టవర్‌ఏర్పాటుకు శుక్రవారం ఆ శాఖ జేటీవో రవికుమార్, జేఈ తేజల ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు.పరిశీలించిన స్థలం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, వారి అనుమతిస్తే టవర్ పనులు ప్రారంభించి 4జీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


చందన(ఫైల్)

శ్రీకాకుళం క్రైం: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. విశాఖ-బీ కాలనీకి చెందిన జామి శ్రీనివాసరావుతో చందన(30) అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గత కొంత కాలంగా చందన అనారోగ్యానికి గురై మానసికంగా బాధపడుతుంది. శుక్రవారం సాయంత్రం భర్తతో పాటు సమోసాలు చేసే పనిలో నిమగ్నమైన ఆమె.. ఐదు గంటల సమయంలో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎంతకీ గదిలోంచి చందన రాకపోవడంతో వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్ తలుపులు లోపలి నుంచి గెడ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో తలుపులు పగలగొట్టి శ్రీనివాసరావు లోపలికి వెళ్లి చూడగా.. తన భార్య ఫ్యాన్‌కు ఉరేసుకొని వేళాడుతూ కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు అస్వస్థత

- చికిత్స పొందుతూ మృతి.. విశాఖలో ఘటన


చిట్టి కృష్ణ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం నుంచి విశాఖ ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు డ్రైవరు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వెంటనే అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం ఆర్టీసీ డీఎం, సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం వన్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న చిట్టి కృష్ణ (50) శుక్రవారం ఉదయం ఆరు గంటలకు వైజాగ్ నాన్‌స్టాప్ బస్సు విధులకు హాజరయ్యాడు. ప్రయాణికులతో ఎనిమిది గంటల సమయంలో విశాఖపట్టణ పరిధి మద్దిలపాలెం చేరుకునే సరికి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బస్సును మద్దెలపాలెం డిపోలో ఆపేసి.. వేరే బస్సులో ప్రయాణికులను పంపించేశారు. ఈ క్రమంలో తీవ్ర అవస్వస్థతకు గురైన కృష్ణ డిపోలోని బల్లపై సొమ్మసిల్లిపడిపోయాడు. దీంతో ఆర్టీసీ సిబ్బంది అతడికి సపర్యలు చేసినా.. ఫలితం లేకపోవడంతో 108లో ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ చనిపోయాడు. మృతదేహాన్ని శ్రీకాకుళం బలగ ప్రాంతంలో గల అతని నివాసానికి తీసుకువచ్చారు.

బెల్లం ఊట ధ్వంసం

హరిపురం: మందస మండలం కొండలోగాం పంచాయతీ పరిధిలో గల దలకాయిలో శుక్రవారం ఎస్ఈబీ సీఐ జైభీమ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 1,500 లీటర్ల బెల్లం ఊటలు, 35 లీటర్లు సారా స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతారావు, నాయుడు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- బేతాళపురానికి చెందిన ఇద్దరి అరెస్టు

పలాస: కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్‌లో ఎస్ఈబీ అధికారులు శుక్రవారం కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్టు చేశారు. సీఐ ఎంఆర్‌పీ అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. మందస మండల బేతాళపురానికి చెందిన పుక్కల దిలీప్‌కుమార్, చెల్లూరి వెంకటేష్ 90 ఎంఎల్ పరిమాణం ఉన్న 460 టెట్రా ప్యాకెట్లు, 180 ఎంఎల్ పరిమాణం ఉన్న 144 మద్యం టెట్రా ప్యాకెట్లు లగేజి బ్యాగుల్లో తరలిస్తున్నారు. మూడురోడ్ల జంక్షన్ వద్ద ఎస్ఈబీ సిబ్బంది తనిఖీల్లో భాగంగా దిలీప్‌కుమార్, చెల్లూరి వెంకటేష్‌ను సోదా చేయగా అక్రమ మద్యం బయట పడింది. వీటిని కర్ణాటకలో కొనుగోలు చేసుకొని ఈ ప్రాంతంలో విక్రయానికి తీసుకువస్తున్నట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి పలాస కోర్టులో హాజరుపరిచారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పీవీ గిరిబాబు, జీవీ రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కిరాణా బడ్డీ దగ్ధం

ఎచ్చెర్ల: ఫరీద్‌పేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి సేపాన షైమావతికి చెందిన కిరాణా బడ్డీ అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ఇళ్లలో ఉన్న ప్రజలు అప్రమత్తమై మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

పొందూరు పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటరావుకు జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న ఎంఎస్‌సీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సమయంలో అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సెలవు పెట్టడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు ఎంఈవో-1 రామరాజు తెలిపారు.

బినామీ ఉద్యోగి నిర్వాకంపై విచారణ

పొందూరు: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బినామీ ఉద్యోగి నిర్వాకంపై శుక్రవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి విచారణ చేపట్టారు. విద్యార్థినులకు ఆ బినామీ ఉద్యోగి అసభ్యకరంగా వాట్సాప్ మెసేజ్‌లు పెట్టడంపై ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఇటీవల పోలీసులు విచారణ చేపట్టారు. దీనిపై వచ్చిన కథనాలపై ఆర్‌జేడీ విచారణకు ఆదేశించారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈవో విచారణ చేపట్టారు. పాఠశాలలోని ఒక ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యప్రవర్తన పైనా విచారణ చేపట్టారు. పాఠశాలలో జరుగుతున్న ఘటనలపై నిర్లక్ష్యంగా ఉన్న హెచ్‌ఎం పి.వెంకటరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు తెలిపారు.

కనిమెట్ట పోస్టాఫీసులో అవకతవకలపై..

పొందూరు: కనిమెట్ట బ్రాంచ్ పోస్టాఫీసులో బీపీఎం ఆర్థిక అవకతవకల పై శుక్రవారం పోస్టల్ జిల్లా అధికారులు విచారణ జరిపారు. బీఎం లోకేష్ రెండు రోజులుగా కార్యాలయానికి రాకపోవడం, తమ ఖాతాల నిర్వహణపై అనుమానంతో గ్రామానికి చెందిన ఖాతాదారులు జిల్లా పోస్టల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.గౌరాశంకర్ రెండురోజులుగా విచారణ జరుపుతున్నారు. రెండునెలలుగా ఖాతాదారులు కడుతున్న ఎస్‌బీ, ఆర్‌డీ అకౌంట్‌లకు చెందిన నగదు వారి ఖాతాలో జమచేయకుండా తన సొంత అవసరాలకు వినియోగించుకుని అవకతవకలకు పాల్పడినట్టు ఆయన గుర్తించారు. రెండు రోజులుగా జరిపిన విచారణలో సుమారు రూ.50 వేలు పైగా ఆర్థికలావా దేవీల్లో అవకతవకలు గుర్తించామని పూర్తిస్థాయిలో ఖాతాదారులను విచారించాల్సి ఉందన్నారు.

ఒడిసాలో బొల్లినేని మెడిస్కిల్స్


ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఒడిసా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఆ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రదాన్ సమక్షంలో అధికారులతో ఎంఓయూ కుదిరిందన్నారు. గజపతి జిల్లా ఉపాధి కల్పనాధికారి సౌభాగ్య ఎస్ఆర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

లావేరు: కొబ్బరి రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం హార్టీకల్చర్ శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. శుక్రవారం లావేటిపాలెంలో రైతు ఇనపకుర్తి సీతారామరాజు పంట పొలంలో వేసిన కొబ్బరి పంటలో క్షేత్ర పరిశీలన చేశారు. కొబ్బరిలో ఎరువుల యాజమాన్య పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త నీలవేణి, ఉద్యానశాఖాధికారి ఎం.అనూష, వీఏఏ ప్రమీల, వీహెచ్ఏ పి.గిరిజ పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీదారులకు ప్రయోజనం

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాల్లో పంచసూత్రాలు పాటిస్తూ ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘ సభ్యురాలికి ఆహార ఉత్పత్తుల తయారీ కోసం ఆర్థిక ప్రయోజనం ప్రభుత్వం కల్పిస్తుందని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏ వస్తువు తయారీ యూనిట్ పెట్టుకున్నా 35 శాతం సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, చంద్రరావు, వీవోఏలతో పాటు అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికం 'స్మృతివనం'

- కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్
- జాతీయ జెండాతో ర్యాలీ


పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

అరసవల్లి/ శ్రీకాకుళం కల్చరల్: దేశానికి స్వాతంత్ర్య సమర యోధుల స్మృతివనం నిలుస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మువ్వన్నెల పతాక రెపరెపలతో సిక్కోలు నగరం శుక్రవారం మురిసిపోయింది. గాంధీ మందిరం బృందం, ఇండియన్ ఆర్మీ కాలింగ్ బృందం ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియం నుంచి శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం వరకు జాతీయ పతాకంతో నిర్వహించిన ర్యాలీలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. గాంధీ మందిరంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా గాంధీ మందిరం, ఇంతమంది స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, జాతీయ జెండా ఏర్పాటుతో ఈ ప్రదేశం ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించినట్టు ఉందని కొనియాడారు. భావితరాలవారికి ఈ కేంద్రం ఒక స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. దేశానికి రెండు కళ్లుగా నిలిచే సైనికుడు, రైతుల ప్రతిరూపంతో కూడిన అరుదైన విగ్రహాన్ని తనవంతుగా ఇక్కడ ఏర్పాటు చేయిస్తాన న్నారు. జాతీయ జెండాను మోసిన శ్రీకాంత్, పింగళి వెంకయ్య విగ్రహదాత గుత్తు సరస్వతిలను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, బాడాన దేవభూషణరావు, నూన సన్యాసిరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన మురళి, నక్క శంకరరావు, మహిబుల్లాఖాన్, ఎంవీఎస్ భట్లు, పందిరి అప్పారావు, నిక్కు అప్పన్న, పైడి హరనాథరావు, డీపీఆర్వో కె.బాలమాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్సు

ఇచ్ఛాపురం: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్సు అని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి నాగరాణి అన్నారు. శుక్రవారం తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమాన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలుతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ నుంచి తల్లికి రక్షణ ఉంటుంద న్నారు. నవజాతి శిశువులకు తల్లిపాలు అమృత తుల్యం. పుట్టిన నాటి నుంచి ఆరు నెలల పాటు తల్లి బిడ్డకు పాలు ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నా రన్నారు. నవజాతి శిశువులకు తల్లిపాలు పోషకా హారం ఇందులో కొవ్వులు, ప్రోటీన్లు, కార్బో హైడ్రే ట్లు, ఖనిజాలు, విటమిన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమా, జయ, ఉమారాణి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్ పరిశీలన

బూర్జ: నాగావళి నదీతీరంలో కాఖండ్యాం ఇసుక ర్యాం ప్‌ను శుక్రవారం తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ సందర్శించారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎవరికి పర్మిషన్లు మంజూరు చేయలేదన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నారాయణపురం ర్యాంప్ నుంచి రాత్రి పూట ఇసుక తరలిస్తున్నారని సమాచారం వచ్చిందని, అలా జరగకుండా అరికడతామన్నారు.

మాతృ, శిశు మరణాలు పునరావృతం కానివ్వొద్దు


సమీక్షిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కలెక్టరేట్: మాతృ, శిశు మరణాలు నివారించాలని, పునరావృతం కారాదని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. మాతృ, శిశు మరణాలపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతీ కేసును వైద్యుడు పర్యవేక్షించాలని, హైరిస్క్ కేసులను అతి జాగ్రత్తగా పరిశీలించాలని, ఏఎన్ఎం, సూపర్‌వైజర్లపై ఆధారపడకూడదన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డాక్టర్ పార్వతి, ఇన్‌చార్జి డీఐవో పి.వెంకటరావు, ఆయా మండలాల వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కలెక్టరేట్: జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు, రిజిస్ట్రేషన్ అయిన కేంద్రాల వివరాలపై ఆరా తీశారు డీఎంహెచ్‌వో మీనాక్షి మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 19 ప్రభుత్వ, 83 ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలన్నీ రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయన్నారు. సమావేశంలో ఏఎస్పీ ప్రేమ్ కాజల్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఏడీఎంహెచ్‌వో శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం


బ్యాగులు అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: ప్రజల దాహార్తి తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శుక్రవారం దవళపేటలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.45.80 లక్షలతో నిర్మించనున్న రక్షిత నీటి పథకానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించటమే లక్ష్యంగా ముందుసాగుతున్నామన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, సర్పంచ్ వి.మహేష్, కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో వెంకన్నబాబు, డీఈ సూర్యనారాయణ, ఏఈ బాగ్యలక్ష్మి తదితరులు పాలొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం

ఎచ్చెర్ల: ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. అఖింఖాన్‌పేట గ్రామంలో రూ.50.8 లక్షలతో నిర్మించనున్న రక్షిత నీటి పథకానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం కార్పొరేషన్‌లో గతంలో విలీనమైన తోటపాలెం, కుశాలపురం గ్రామ పంచాయతీలను తిరిగి ఎచ్చెర్ల మండలంలో కొనసాగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గూరు జగపతిబాబు, కూటమి నేతలు సంపతిరావు నాగేశ్వరరావు, విశ్వక్సేన్, పైడి ముఖలింగం, డీఈఈ సూర్యనారాయణ, జేఈ హేమలత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రణస్థలం: యువతకు ఉపాధి కల్పించడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన నల్‌జల్ మిత్ర ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు మహిళలకు మల్టీస్కిల్ ట్రైనింగ్‌లో 60 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ముప్పిడి సరేష్, పిషని జగన్నాథంనాయుడు, లంక ప్రభ, వద్దాది శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఏపీఎం ఎంవీ రత్నం తదితరులు పాల్గొన్నారు

వాడీవేడిగా ఉపాధి గ్రామసభ

సరుబుజ్జిలి: ఒప్పదాం గ్రామంలో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ వాడివేడిగా సాగింది. సోషల్ ఆడిట్ డీఆర్‌పీ కె.కృష్ణ ఇటీవల కాలంలో ఆడిట్ బృందం సర్వేలు ద్వారా సేకరించి వివరాలను సభలో చదివి వినిపించారు. జాబ్‌కార్డులు, అప్‌డేట్ కానట్లు, మస్తర్లలో సంతకాలు లేకుండా దిద్దుబాట్లు చేసి బిల్లులు చెల్లించినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు డిఆర్‌పి వెల్లడించారు. ఏకపక్షంగా ఆడిట్‌లో తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని, పనికి వచ్చిన వేతనదారుడికి మా త్రమే మస్తర్లు వేసినట్టు, ఎటువంటి దిద్దుబాట్లు చేయలేదని, ఫీల్డ్ అసిస్టెంట్ పేడాడ వెంకన్న సభ దృష్టికి తెచ్చారు. దీనితో సభలో గ్రామస్తుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నారు. సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. స్థానిక ఎస్ఐ బి.నిహార్ రంగ ప్రవేశం చేసి ఎటువంటి వివాదాలు లేకుండా సద్దుమణిగించి సభను సజావుగా కొనసాగించారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ భర్త పేడాడ వెంకటరమణ, ఉపాధి హామీ ఈసీ సి.హెచ్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి


గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఏఎస్పీ

ఎచ్చెర్ల: సాయుధ పోలీసు సిబ్బంది విధులను అంకిత భావంతో నిర్వర్తించాలని అడిషనల్ ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ అన్నారు. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో సిబ్బంది నుంచి ఆమె శుక్రవారం గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. శారీరక, మానసిక దృఢత్వంతోనే చురుకుగా ప్రజలకు సేవలందించవచ్చన్నారు. పోలీసు పెరేడ్‌ను పరిశీలించి ఆమె పలు సూచనలు చేశారు.

డ్వామా పీడీకి నివేదిస్తా


దివంజిపేటలో విచారణ నిర్వహిస్తున్న ఏపీడీ లోకేష్

ఆమదాలవలస: నైరా గ్రామ పంచాయతీ ఉపాధి పథక క్షేత్ర సహాయకులపై జరిగిన విచారణ నివేదిక డ్వామా పీడీకి నివేదిస్తానని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లోకేష్ తెలిపారు. ఉపాధి హామీ గత కొంతకాలంగా క్షేత్ర సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న వారిపై వేతనదారులు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం దివంజీపేటలో ఉపాధి హామీ అధికారులు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభకు హాజరైన కొంతమంది వేతనదారులు, క్షేత్ర సహాయకుడు కొంతమంది గ్రామంలో లేని తన బంధువులకు మస్తర్లు వేసినట్టు ఆరోపించగా ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్‌కు చెందిన కొంతమంది వ్యక్తిగత కారణాలతో తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని సమాధానం ఇచ్చారు. దీనినితో గ్రామసభలో ఉన్న రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు కేకలు వేస్తూ వాగ్వావాదానికి దిగగా, పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం ఏపీడీ లోకేష్‌కు ఇరు వర్గాలక చెందిన వేతనదారులు అభిప్రాయాలను రికార్డు చేశారు. ఏపీడీ లోకేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారుల ఫిర్యాదు మేరకు తాను విచారణ చేశానని, ఇక్కడ జరిగిన అంశాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు నివేదించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎస్.లక్ష్మి, నరసమ్మ, సర్పంచ్ సైలాడ దాసునాయుడు, సుధ పాల్గొన్నారు.

దేశ సేవ చేసేందుకు అవకాశం


సదస్సులో మాట్లాడుతున్న సందీప్

గుజరాతీపేట: విద్యార్థులు దేశ సేవ చేసేందుకు అగ్నివీర్ వంటివి ఉపయోగపడతాయని ఎయిర్‌ఫోర్స్ కార్పరల్ ఎస్.సందీప్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో శుక్రవారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ వాయి ఇండియన్ ఎయిర్ రోమన్స్ ఎంపికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అగ్నివీర్ ద్వారా ఉద్యోగ అవకాశంతోపాటు మంచి క్రమశిక్షణ కలుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్య చంద్రరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో దేవకాంత్ మిశ్రా, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధారాణి, సెట్‌శ్రీ సీఈవో ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అధ్యాపక బృందం ఎల్.కృష్ణారావు, ఎల్.కృష్ణారావు, మోహన్ రాజు, లలితా బాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి జూనియర్ బాలురు, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాస్థాయి ఎంపికలు 4వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి సిగిలిపిల్లి లక్ష్మీదేవి తెలియజేశారు. ఇందులో పాల్గొనాలనుకునే క్రీడాకారులు సబ్‌జూనియర్స్‌లో 2007 జనవరి 1వ తేదీలో, సబ్ జూనియర్స్‌కు సంబంధించి 2010 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 17 నుంచి 19న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంపికలకు హాజరై ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ వద్ద రిపోర్టు చేయాలన్నారు.

జనసేన సభ్యత్వాలు పూర్తి

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో జనసేన పార్టీకి సబంధించిన 10వేలు సభ్యత్వాలు పూర్తి చేసినట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. ఈ సందర్భంగా వీకేపేటలో గల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పదివేల క్రియాశీల సభ్యత్వాల నమోదు కావటం ఆనందరంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, బి.ఈశ్వరరావు, జనసే పార్టీ నాయకులు, క్రియాశీల వాలంటీర్లు పాల్గొన్నారు.

చెరువు కాదు.. ప్రధాన రహదారే


చెరువులా మారిన ఏబీ రహదారి

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన అలికాం-బత్తిలి రహదారి చెరువును తలపిస్తుంది. శ్రీకాకుళం నుంచి జిల్లాలోని ప్రధాన ప్రాంతాలతో పాటు అంతర రాష్ట్ర రహదారిగా గుర్తింపు పొందిన ఏబీ రహదారి గత కొంతకాలం నుంచి పూర్తి నిర్లక్ష్యానికి గురైందంటూ విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జరుబుజ్జిలి మండల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న అర కిలోమీటరు దూరం ఉన్న ఈ ప్రాంతంలో గత కొంతకాలం నుంచి ఏర్పడిన భారీ గుంతలు వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ప్రధాన రహదారి కల్వర్టు కుంగి డ్రైనేజీ నీరు మొత్తం రోడ్డుపై చేరి గుంతలో నిల్వా ఉండిపోతుంది. దీంతో ప్రధాన రహదారిలో నిత్యం రాకపోకలు సాగించే భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడి రహదారి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

అకౌంటెన్సీపై శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభించనున్న కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నామని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 30 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. 19-45 ఏళ్ల లోపు గల పురుష అభ్యర్థులు శిక్షణలో చేరేందుకు అర్హులన్నారు. ట్యాలీ, అకౌంటెన్సీ, ఇన్‌వెంటరీ, జీఎస్టీ, బేసిక్ ఎంఎస్ ఆఫీస్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నెంబర్లు 79933 40407, 95534 10809లో సంప్రదించాలన్నారు.

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా రవీంద్రనాథ్


రవీంద్రనాథ్

జి.సిగడాం: సంతవురిటి గ్రామానికి చెందిన వాండ్రంగి రవీంద్రనాద్ జేఎన్‌టీయూ(కాకినాడ) రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. రవీంద్రనాథ్ విద్యాభ్యాసం ప్రాథమిక పాఠశాల నుంచి బీఎస్సీ డిగ్రీ వరకు శ్రీకాకుళంలోనే సాగింది. ఖరగ్‌పూర్ ఐఐటీలో పీజీ, ఢిల్లీ ఐఐటీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. 1985లో కాకినాడ జేఎన్‌టీ యూ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా చేరి.. విభా గాధిపతిగా ఎదిగారు. 2008 నుంచి 2017 వరకు బోర్డ్‌ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. అలాగే జేఎన్‌టీయూ పరీక్షల అధికారి ఇన్‌చార్జిగా, అడ్మిషన్స్ అధికారిగా విధులు నిర్వర్తించారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా, వివిధ హోదాల్లో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా నియమింపడడంతో రవీంద్రనాథ్‌ను సంతవురిటి గ్రామ ప్రజలు, ఆయన సహచరులు హర్షం వ్యక్తంచేశారు. ఈయన తండ్రి వీవీఎస్ రామలింగేశ్వరరావు ఎల్ఐసీ (విశాఖ) సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా, తల్లి యామిని పూర్ణతిలకం గృహిణి ఉన్నారు.

అలంకరణలో సంతోషిమాత



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాతకు పూజలు ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాగునీరు విడిచిపెట్టాలి

పొందూరు: నారాయణపురం కాలువ పరిధిలో వెంటనే సాగునీరు విడుదల చేయాలని గోరింట సాగునీటి సంగం మాజీ అధ్యక్షుడు పొన్నాడ రామారావు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు ప్రారంభించి నెలరోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు సాగునీరు విడిచిపెట్టకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కాలువ పరిధిలో సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన వేలాది ఎకరాలు ఆయకట్టు ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల సాగునీరు లేక వేలాది ఎకరాలు వరి పంట ఎండిపోతుందని ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారన్నారు. నారాయణపురం ప్రాజెక్ట్ అధికారుల తీరుపై మండల రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు.

నేడు జిల్లాకు రానున్న కేంద్రమంత్రి

అరసవల్లి: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం జిల్లాకు రానున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని తన స్వగృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వేకు చెందిన జీఎం, డీఆర్ఎంలతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం నగరంలోని ఓ హోటల్‌కు చేరుకుని కేంద్ర సామాజిక న్యాయ శాఖ, అలింకో నిర్వహించే దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం తమ నివాసానికి చేరుకుంటారు.

భువనేశ్వర్ వెళ్లి..


పింఛన్ డబ్బులు అందిస్తున్న కృష్ణంరాజు

కంచిలి: అనారోగ్యంతో భువనేశ్వర్‌లో గల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పింఛన్‌దారులు పిలక సావిత్రికి జాడుపూడి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణంరాజు శుక్రవారం పింఛన్ డబ్బులు అందజేశారు. అలాగే విశాఖలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొక్కిలిపుట్టుగ సచివాలయ పరిధిలో గల మోహిని సాహు, జామి సాహు, జోడి దొలాయిలకు సూదిపుట్టుగ, దొలాయిపుట్టుగ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అమీర్ పింఛన్ డబ్బులు అందించారు.

- **నందిగాం:** మాదిగాపురం గ్రామానికి చెందిన రోణంకి చామంతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శుక్రవారం పెద్దబాణాపురం సచివాలయ సంక్షేమ సహాయకులు కె.సంతోష్ విశాఖ వెళ్లి ఆమెకు పింఛన్ డబ్బులు అందించారు.

అభినందన

గార: కళింగపట్నంలో నూతనంగా ఎన్నికైన మెరైన్ ఫిషరీస్ సొసైటీ అధ్యక్షుడు బెనియా గురుదేవ్‌ను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గొండు శంకర్ దుస్సాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళింగపట్నం పంచాయతీ మాజీ సర్పంచ్, జిల్లా టిడిపి వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి, మాజీ ఎ.ఎం.సి. డైరెక్టర్ పొట్నూరు వైకుంఠరావు పాల్గొన్నారు.

బాలలను పనిలో చేర్పిస్తే చర్యలు

లావేరు: బాలకార్మికులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా తగు చర్యలు తీసు కోవడం జరుగు తుందని శ్రీకాకుళం సహాయ లేబర్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం లావేరు, వెంకటాపురం గ్రామాల్లో పర్యటించారు. ఎంఈవో త్రినాథరావు, హెచ్‌సీ రామారావు, సీసీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో మేలు

కంచిలి: సేంద్రియ పద్ధతులు పాటించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహన్‌రావు అన్నారు. అంపురం గ్రామంలో శుక్రవారం గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. నాట్లు వేసుకునేటప్పుడు గాలీ, వెలుతురు తగిలేలా కాలిబాటలు వేసుకోవాలని సూచించారు.